క్లుప్తంగా

ఘనంగా ఎంఐఎం ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు మోయిజ్ ఖురేషి

ధారూరు: ఎంఐఎం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు మోయిజ్‌ఖురేషి ముందుగా ధారూరు సాహిరి బస్వరాజ్ గ్రౌండ్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించి, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఖురేషి మాట్లాడారు. పార్టీ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రజల్లో విశ్వాసాన్ని చూరగొంటూ, అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కేవలం హైదరాబాద్‌లోని పాత బస్తీలో స్థాపించిన పార్టీ, నేడు తెలంగాణతో పాటు పలు రాష్ట్రాలకు విస్తరించిందని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీని ఆదరిస్తున్న ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


రామలింగేశ్వరుడికి బీజేపీ శ్రేణుల పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ శ్రేణులు

కుల్కచర్ల: మండల పరిధి బండవెల్కిచర్ల గ్రామంలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్, ఆ పార్టీ నాయకులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడారు. హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని కోరారు. నియోజకవర్గ పరిధిలో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జానకిరాం, పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్, పూడూరు మండల అధ్యక్షుడు అనిల్, పరిగి మండల ప్రధాన కార్యదర్శి నర్సింహ, టౌన్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, రవి పాల్గొన్నారు.

వైభవంగా గణపతి విగ్రహ ప్రాణప్రతిష్ఠ



గణపతి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేస్తున్న రామానుజ జీయర్ స్వామి

తాండూరు రూరల్: జినుగుర్తి శివారు ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్‌లోని సిందూర గణపతి ఆలయంలో గణపతి విగ్రహానికి ఘనంగా ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. మూడు రోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. అందులో భాగంగా శనివారం గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచ గవ్యారాధన, యంత్రస్థాపనతో పాటు గణపతి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేశారు. ఉత్సవంలో త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రతినిధులు సుబ్బారావు, మల్లేశం, జయదేవ్, కృష్ణముదిరాజ్, బాల్‌రెడ్డి, నాగప్ప, బాలకృష్ణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్, ఆంజనేయులు, ప్రభుశంకర్, రమేష్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒకే ఈతలో మూడు మేక పిల్లలు



మేక పిల్లలను చూపిస్తున్న గొర్లకాపరి

పెద్దేముల్: ఒకే ఈతలో.. ఒక మేక మూడు పిల్లలకు జన్మనిచ్చింది. ఈ సంఘటన పెద్దేముల్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక గొర్ల కాపరి మేముల శ్రీనుకు చెందిన మేక.. గతంలో మూడు సార్లు ఈనింది. రెండు ఈతల్లో ఐదైదు, మరోసారి ఆరు మేక పిల్లలకు జన్మనిచ్చింది. తాజాగా అదే మేక.. మరో మూడు పిల్లలను ఈనిందని యజమాని తెలిపారు. ఈ మేక పిల్లలను గ్రామస్తులు చూసి ఆశ్చర్యం వ్యక్తంచేశారు.

కందులతో మార్కెట్ కళకళ

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు శనివారం 102 బస్తాల కందులు వచ్చాయని మార్కెట్ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు. క్వింటాల్‌కు రూ.10,250 నుంచి రూ.10,350 ధరతో కొనుగోలు చేసినట్లు ఆమె చెప్పారు. అదే విధంగా 120 బస్తాల వేరుశనగ వచ్చిందని, క్వింటాల్‌కు గరిష్టంగా రూ.6,550, కనిష్టంగా రూ.6,700 ధరతో కొనుగోళ్లు జరిపినట్లు సిద్దమ్మ వెల్లడించారు.

వట్టిపోతున్న బోర్లు.. ఎండుతున్న పొలాలు



నిన్నమొన్నటి వరకు నీరుపోసి, అడుగంటిన బోరు

పంటలను కాపాడుకునేందుకు.. కర్షకుల పాట్లు



దౌల్తాబాద్ శివారులో ఎండిన వరిపంట

దౌల్తాబాద్: వేసవికాలం మొదట్లోనే భానుడు ఉగ్రరూపం దాల్చుతుండటంతో.. రైతుల ఆరుగాలం కష్టం ఆవిరైపోతోంది. బోరు బావులు అడుగంటి.. పంటలకు నీరు అందక కళ్ల ముందే ఎండిపోతుండటంతో కర్షకులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. పంటలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. అడుగంటుతున్న భూగర్భ జలాలతో.. బోర్ల కింద సాగు చేసిన వరికి నీరందక.. చేలు నెర్రలు చాచడంతో అన్నదాతలు దిక్కులు చూస్తున్నారు.

కీలకదశలో నీటికొరత..

మండలంలో సుమారు 4,689 ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుతం వరి చిరుపొట్టదశలో ఉంది. ఈ దశ నుంచి గింజలో పాలునింపే వరకు ఎక్కువ మోతాదులో నీరు అవసరం ఉంటుంది. ఈ కీలక దశలో బోరుబావుల్లో నీరు అడుగంటడం.. అన్నదాత నెత్తిమీద పిడుగుపడినట్లయింది. దీంతో ఏం చేయాలో తోచక.. పక్కపొలం రైతుల నుంచి అధిక డబ్బులు చెల్లించి, నీటిని మళ్లించుకుంటుండగా.. మరి కొందరు ఎండిన పొలాలను వృథాగా వదిలేస్తున్నారు.

ఉష్ణోగ్రతల పెరుగుదలతో..

మండల పరిధి గ్రామాల్లో చాలా మంది రైతులు బోరుబావులపై ఆధారపడి వరి సాగు చేస్తుండగా.. వేసవి ఉష్ణోగ్రతలు పెరిగి, చెరువులు, కుంటలు, బోర్లు అడుగంటి ఆగం పట్టిస్తున్నాయి. పొట్ట దశలో ఉన్న పంటలు ఎండుముఖం పట్టడంతో.. పంట దక్కేటట్లు లేదని రైతన్నలు ఆశలు వదులుకుంటున్నారు. చేసేది లేక పంట పొలాలను పశువులకు మేతగా వినియోగిస్తున్నారు.

‘ధరణి’ సమస్యలు పరిష్కరించండి



కొడంగల్: మాట్లాడుతున్న తహసీల్దార్



బంట్వారం: అర్జీలను పరిశీలిస్తున్న తహసీల్దార్

కొడంగల్: ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ విజయకుమార్ అన్నారు. శనివారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రెవెన్యూ సిబ్బందితో ఆయన మాట్లాడారు. మండలంలో మొత్తం 519 ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటి పరిష్కారానికి ఈ నెల 9వ తేది వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే మూడు టీంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో దరఖాస్తులను పరిశీలించి, విచారించి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. సమీక్షలో డీటీ సురేష్, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

సత్వర చర్యలు

బంట్వారం: ధరణి సమస్యలపై సత్వర చర్యలకు శ్రీకారం చుట్టామని కోట్‌పల్లి తహసీల్దార్ ఆశాజ్యోతి అన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఆమె రెవెన్యూ కార్యాలయంలో ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడారు. ధరణికి సంబంధించి సుమారు 400 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, అర్జీ దారులతో చర్చించి, అప్పటికప్పుడే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అర్జీదారులు రెవెన్యూ అధికారులకు సహకరించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐలు రమేష్, భాగ్యలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ లింగం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం నేడు

కొడంగల్: బొంరాస్‌పేట మండలం ఎన్కెపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని గాయత్రి నర్సింగ్ హోం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

13 మంది గైర్హాజరు

కొడంగల్: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష శనివారం జరిగింది. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 517 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. 504 మంది హాజరయ్యారు. మిగతా 13 మంది ఆబ్సెంట్ అయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ తెలిపారు.

గ్రామ స్వరాజ్యమే ప్రభుత్వ ధ్యేయం

బంట్వారం: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య నిర్మాణమే ప్రభుత్వ ధ్యేయమని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరీశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధి తొర్మామిడిలో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన శనివారం పరిశీలించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఎమ్మెల్యే, స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ సహకారంతో నియోజకవర్గం అభివృద్ధిలో పరుగు తీస్తుందని తెలిపారు. గతంలో ప్రసాద్‌కుమార్ మంత్రిగా పని చేసిన సమయంలో చేపట్టిన అభివృద్ధే తప్ప.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొత్తగా ఒరగ బెట్టింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి



సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

కుల్కచర్ల: పార్టీలకు అతీతంగా, ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. శనివారం మండల పరిధి ముజాహిద్‌పూర్ గ్రామంలో ఉపాధిహామీ నిధులు రూ.5లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పల్లెల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు తులసిరాం, చంద్రయ్య, వెంకటయ్య, భీమయ్య, శ్యాం, పెంటయ్య, కృష్ణయ్య, వెంకట్, పులిరంగ చిన్న వెంకటేశ్, షర్ఫొద్దీన్, సోమలింగం, భాస్కర్, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

తాండూరు రూరల్: మండల పరిధి బెల్కటూర్ గ్రామ శివారు మల్లికార్జున దేవాలయంలో శనివారం శివ పార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. శివుడి తరఫున గాండ్ల సంగప్ప, శివలీల, మఠం సుధీర్, శాంతకుమారి కాగా.. పార్వతీదేవి తరఫున వెంకటేశం, సౌభాగ్యవతి, సంతోష్‌కుమార్, అన్నపూర్ణ దంపతులు కూర్చుని కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, శివ స్వాములు పాల్గొన్నారు.

బీజేపీ ‘ప్రచార’ సంచులు స్వాధీనం



సంతలో పంపిణీ చేసిన సంచులు

ధారూరు: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా, పార్టీ గుర్తులతో బీజేపీ శ్రేణులు సంతలో చేతి సంచులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకుల సమాచారం మేరకు పోలీసులు వీటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన శనివారం ధారూరులో కూరగాయల మార్కెట్‌లో చోటుచేసుకుంది. బీజేపీ నేతలు మోదీ, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కమలం పువ్వు బొమ్మలతో ముద్రించిన సంచులను ఆ పార్టీ శ్రేణులు సంతలో పంపిణీ చేశారు. ఇది గమనించిన కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకొని, 95 సంచులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎఫ్ఎస్‌టీ టీంకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

పశువులను జాగ్రత్తగా చూసుకోవాలి

కృషి విజ్ఞాన కేంద్రం పశు సంవర్ధక విభాగం శాస్త్రవేత డాక్టర్ సుధీర్‌కుమార్

షాబాద్: పాడి పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని, ఎప్పటికప్పుడు డాక్టర్ల సలహాలు పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం పశు సంవర్ధక శాస్త్రవేత డాక్టర్ సుధీర్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని ముద్దెంగూడ గ్రామంలో జిల్లా క్రీడ కృషి విజ్ఞాన కేంద్రం, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పశువుల్లో వచ్చే సమస్యలు, తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ఉండే పాడి పశువులకు చికిత్సలు చేయించాలన్నారు. సంకరజాతి పశువుల్లో వచ్చే పునరుత్పత్తి సమస్యలు, మేలైన పశుగ్రాసం అందజేస్తామన్నారు. చూడి పశువుల జాగ్రత్తలు, షెడ్ నిర్వహణ, ఆధునిక యంత్రాలపై అవగాహన కల్పించామన్నారు. సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ యువత స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ పథకం ద్వారా శిక్షణ పొంది, వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉపాధి అవకాశాలు పెంచుకోవాలన్నారు.

మొయినాబాద్ రూరల్: పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలను తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్య అధికారి దేవిరెడ్డి పేర్కొన్నారు. శనివారం పశువైద్య అధికారులు దేవిరెడ్డి అండాపూర్ గ్రామంలో, శ్రీలతరెడ్డి కనకమామిడిలో గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాధి నివారణకు టీకా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వేసవి కాలంలో పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. ఉచిత టీకాల పంపిణీని రైతులు తమ పశువులకు వేయించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

గాలికుంటు నివారణకు..

షాబాద్: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని రేగడిదోస్వాడ, షాబాద్ పశు వైద్యాధికారులు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ స్రవంతి అన్నారు. మండల పరిధిలోని సోలిపేట్, మక్తగూడ గ్రామాల్లో టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు చుక్కల మందు పంపిణీ

- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కార్యక్రమం
- ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేయించాలి: వైద్యులు



మోమిన్‌పేట: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ సుజల అన్నారు. మండల పరిధిలో 0–5 ఏళ్లలోపు 3,487మంది చిన్నారులు ఉన్నారని తెలిపారు. ఆదివారం 21 కేంద్రాల్లో పిల్లలకు పోలియో చుక్కలను వేయనున్నామని పేర్కొన్నారు. ఆ రోజు మిగిలిన చిన్నారుల.. ఇంటింటికీ తిరిగి మూడు రోజుల్లో 100శాతం పూర్తి చేస్తామని ఆమె వెల్లడించారు.

బూత్‌ల తగ్గింపు..

గతంలో మండల పరిధి గ్రామాల్లో మొత్తం 35బూత్‌లను ఏర్పాటు చేయగా.. ప్రస్తుతం 14 తగ్గించి, 21కి పరిమితం చేశారు. కేంద్రాలను తగ్గించడం వలన చుక్కల పంపిణీకి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: మండల పరిధి గ్రామాల్లో చిన్నారులకు పోలియో చుక్కలను వేయనున్నామని వైద్యాధికారి రతన్‌లాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు, సమీపంలోని పోలింగ్ కేంద్రాల్లో చుక్కల మందు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. మండలంలో 5,224 మంది చిన్నారులు ఉండగా.. 54 పోలింగ్ బూతులను ఏర్పాటు చేసినట్లు రతన్‌లాల్ పేర్కొన్నారు.

బంట్వారంలో..

బంట్వారం: ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించాలని కోట్‌పల్లి పీహెచ్‌సీ డాక్టర్ గీతిక ఒక ప్రకటనలో కోరారు. పల్స్‌పోలియో కార్యక్రమం నేపథ్యంలో.. కోట్‌పల్లి పీహెచ్‌సీ పరిధిలో ఐదేళ్ల లోపు 645 మంది, కరీంపూర్‌లో 1,127 మంది చిన్నారులు ఉన్నారని పేర్కొన్నారు. రెండు పీహెచ్‌సీల పరిధిలో 11 పోలియో బూత్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కేంద్రాలు తెరిచి ఉంటాయన్నారు. ఇక బంట్వారం పీహెచ్‌సీ పరిధిలో ఐదేళ్లలోపు 1,810 మంది చిన్నారులు ఉన్నారని, ఇందుకు 11 బూత్‌లు ఏర్పాటు చేసినట్లు సీహెచ్‌ఓ విజయ్‌కుమార్ తెలిపారు.

మర్పల్లిలో..

మర్పల్లి: ఐదేళ్లలోపు పిల్లలకు తప్పని సరిగా చుక్కల మందు వేయించాలని పట్లూర్ పీహెచ్‌సీ డాక్టర్ నేహ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధి 27 గ్రామ పంచాయతీల్లో 4,543 మంది చిన్నారులు ఉన్నారని ఆమె పేర్కొన్నారు.

సామాజిక అంశాలనూ బోధించాలి

ఎంఈఓ హబీబ్ అహ్మద్



క్విజ్ పోటీ విజేతలతో అధికారులు

కుల్కచర్ల: విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు సామాజిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు విద్యతో పాటు, సామాజిక అంశాలను బోధించాలని చెప్పారు. ఈ పోటీల్లో చాపలగూడెం ప్రాథమిక పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచింది. మండల స్థాయి పోటీలకు ఎంపికయింది. కార్యక్రమంలో చాపలగూడెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్రవంతి, శిక్షణ ఫౌండేషన్ కోఆర్డినేటర్లు నాగరాజు, రాములు, నవీన్, రమేష్, భ్రమరాంబ, మంజుల, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ ఉంటే.. ఉద్యోగం వెంటే



ఉద్యోగాలు సాధించిన యువకులను సన్మానిస్తున్న భీంరెడ్డి తదితరులు

- డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి
- టీజీటీ ఉద్యోగాలు పొందిన వారికి సన్మానం

కుల్కచర్ల: గురకుల ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంలో గ్రామీణ ప్రాంతాల్లో యువతకు లోటు లేదని ఈ యువకులు నిరూపించారని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. ఇటీవల విడుదలైన గురుకుల ఫలితాల్లో ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన అశోక్, రాజు, సురేష్‌లను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా భీంరెడ్డి మాట్లాడారు. అత్యుత్తమ ప్రతిభతో ఉద్యోగాలు సాధించి, కన్నవారికి, ఉన్న ఊరికి పేరు ప్రఖ్యాతులు తెచ్చారంటూ ఇరువురిని అభినందించారు. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యోగాలు వస్తుండటంతో.. నిరుద్యోగులు సంతోషంగా ఉన్నారని వెల్లడించారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, ఎంపీటీసీ ఆనందం, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోత్కూరు వెంకటేశ్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు అంజనేయులు, చెవిటి వెంకటేశ్, పిట్ల నరేష్, భాను, మురళీ, శ్రీను పాల్గొన్నారు.



అనంతగిరిలో..

అనంతగిరిలో..

అనంతగిరి: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తకాలు చదివి, పోటీ పరీక్షల్లో విజయం సాధించి, ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన బస్వన్న, గౌతం, శంకర్, కిషన్ నాయక్, నరేష్, పాండు, శ్రీకాంత్‌ను సహచరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగం పొందిన వారు మాట్లాడారు. మా విజయంలో గ్రంథాలయం కీలక పాత్ర పోషించిందని తెలిపారు.

బ్యాంకు రుణాలను వినియోగించుకోండి

దోమ: ప్రభుత్వాలు, బ్యాంకులు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ అధికారి వెంకటస్వామి, గడిసింగాపూర్ బ్యాంక్ మేనేజర్ రమేష్‌లు అన్నారు. శనివారం మండలం పరిధి కిష్టాపూర్ గ్రామంలో చేతివృత్తి దారులకు రుణాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వృత్తి పనులు చేసుకునే వారికి ప్రత్యేకంగా రుణ సౌకర్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. వీటిని సద్వినియోగం చేసుకొని, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో లవకుమార్, గోపి, రవి, సతీష్, మధర్ వలీ, ఎంపీటీసీ నర్సింహచారీ, తదితరులు పాల్గొన్నారు.

పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలి



నృత్యం చేస్తున్న చిన్నారులు



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

- పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి
- పాఠశాల వార్షికోత్సవంలో వక్తలు

అనంతగిరి: పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యావ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయని, విద్యార్థులను అందుకు తగినట్లుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందని సెయింట్ జోసెఫ్ ప్రావిన్స్ హైదరాబాద్ పావిన్షియల్ సుపీరియర్ రెవరెండం, కొమ్మరెడ్డి మార్గరేట్ అన్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని సెయింట్ జూడ్స్ ప్రైమరీ పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. వారి ఉన్నతికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కీలకమని, ఇప్పటి నుంచే పిల్లల్లో ఆత్మ విశ్వాసం పెంపొందించాలని సూచించారు. అనంతరం ఎస్ఏపీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మందరికా మాట్లాడారు. విద్యార్థుల్లో దాగున్న ప్రతిభను వెలికితీసే బాధ్యత టీచర్లదేనని చెప్పారు. వారు బాగా చదువుకుని ఉన్నతరంగంలో స్థిరపడి, కన్న వారికి, ఉన్నఊరికి పేరు ప్రఖ్యాతులు తేవాలని కోరారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని, వేలమంది విద్యార్థులను ఉన్నతిగా తీర్చిదిద్దిన ఘనత ఈ పాఠశాలకు దక్కుతుందని వెల్లడించారు. ఇందులో వార్డు కౌన్సిలర్ మోముల స్వాతి, రెవరెండం భాస్కర్, కరస్పాండెంట్ అన్నా మేరి, హెచ్ఎం కొప్పుల పద్మ, తాతిరెడ్డి ఉషారాణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఉన్నారు.